ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 4 సెప్టెంబరు 2024 | 5



సత్యదేవుడి హుండీల్లో భారీగా విదేశీ కరెన్సీ - 7లో

విశాఖ-విజయవాడల మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు - 7లో

మదించి.. కుదింపే



సురేష్‌నగర్ పార్కు

- కాకినాడ కార్పొరేషన్‌లో టీడీఆర్ బాండ్ల కుంభకోణం గుట్టు వీడేనా
- తణుకులో రూ.700కోట్ల టీడీఆర్ బాండ్ల విలువను కుదించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం
- కాకినాడ టీడీఆర్ బాండ్ల విలువ కుదింపు దిశగా అడుగులు
- ఇప్పటికే సీఎం చంద్రబాబుకు ఆధారాలతో ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే కొండబాబు
- సీఎం ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు విచారణ బాధ్యత అప్పగించిన సీఎం
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా రూ.411కోట్ల విలువైన బాండ్ల జారీ
- ప్రభుత్వ స్థలమైన సురేష్‌నగర్ పార్కు పేరుతో రూ.161కోట్లు
- విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం సాకుతో రూ.251కోట్లు బాండ్లు జారీ చేసిన కార్పొరేషన్
- తెరవెనుక చక్రం తిప్పిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ కార్పొరేషన్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జారీచేసిన రూ.411కోట్ల విలువైన టీడీఆర్ బాండ్ల జారీ కుంభకోణం డొంక కదల్చడానికి అడుగులు ముందుకు పడుతున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అప్పట్లో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అడ్డగోలుగా వ్యవహరించారు. అధికారులతో తనకు నచ్చినట్లు బాండ్లు జారీ చేయించుకున్నారు. ఒకచోట ప్రభుత్వ భూమికి, మరోచోట ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నా కావాలని సేకరించిన ప్రైవేటు భూమికి అధికారులు రెట్టింపు ధర కట్టి బాండ్లు జారీ చేసేశారు. తెరవెనుక అంతా కలిపి భారీగా ముడుపులు పంచేసుకున్నారు. అచ్చం ఇలాంటి టీడీఆర్ బాండ్ల జారీ కుంభకోణం తణుకులో రూ.700కోట్ల వరకు వైసీసీ హయాంలో జరగడంతో తాజాగా కొత్త ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. బాండ్ల విలువను భారీగా కుదించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కాకినాడ టీడీఆర్ బాండ్ల విషయంలోను విలువ తగ్గింపు ఖాయమని తెలుస్తోంది. ఇప్పటికే ఈ కుంభకోణంపై సీఎం చంద్రబాబుకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ బాధ్యతను సీఎం ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు అప్పగించారు.

అడ్డగోలుగా బాండ్లు జారీ

గత ప్రభుత్వ హయాంలో కాకినాడ కార్పొరేషన్‌ను వైసీపీ నేతలు పూర్తిగా దోచేశారు. తాము కోట్లలో సంపాదించుకోవడానికి స్కెచ్ వేసుకుని టీడీఆర్ బాండ్లను అడ్డం పెట్టుకున్నారు. అసలే చేతిలో అధికారం ఉండడంతో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి తనకు నచ్చినట్లు బాండ్లకు విలువ కట్టించుకున్నారు. ఇలా గడచిన రెండేళ్లలో కాకినాడ కార్పొరేషన్ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి ఏకంగా రూ.411కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు జారీ చేసేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఈ కుంభకోణాల గుట్టు మట్లు బయటకు వస్తున్నాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఎలా వీటి విలువలు పెంచి బాండ్లు కొట్టేశారనేది చర్చనీయాంశంగా మారింది.

నచ్చినట్లు విలువ కట్టేశారు..

కాకినాడ సురేష్‌నగర్ పార్కు వ్యవహారంలో రూ.160కోట్ల వరకు అడ్డగోలుగా టీడీఆర్ బాండ్లు జారీ చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. వాస్తవానికి సురేష్‌నగర్ పార్కు పూర్తిగా ప్రభుత్వ స్థలం. దీనిలో పార్కు అభివృద్ధికి కార్పొరేషన్ నిధులు కూడా వెచ్చించింది. కానీ పార్కు స్థలం తనది అంటూ ఓ వ్యక్తి దొంగ డాక్యుమెంట్లు సృష్టించాడు. తన స్థలంలో పార్కు ఎలా నిర్మిస్తారంటూ అధికారులను బెదిరించాడు. ఇంతలో ద్వారంపూడి జోక్యం చేసుకున్నారు. తతంగం నడిపి భారీగా డబ్బులు కొట్టేశారు. అందులోభాగంగా పార్కు స్థలం తనది అని నకిలీ పత్రాలు సృష్టించిన వ్యక్తికి అండగా నిలబడ్డారు. ఈ స్థలాన్ని తిరిగి కార్పొరేషన్ పార్కు కోసం తీసుకోవడానికి సమ్మతించేలా చేసి ఆ స్థలానికి ధర కట్టించారు. ఆ మొత్తాన్ని నగదుకు బదులు టీడీఆర్ బాండ్ల రూపంలో జారీ చేశారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వ భూమిని ప్రభుత్వమే ప్రైవేటు వ్యక్తికి డబ్బులిచ్చి కొనుగోలు చేసినట్లయింది. రెండో కుంభకోణం కాకినాడ నగరానికి సమీపంలో దుమ్ములపేటలో చోటుచేసుకుంది. ఇక్కడ పరిశ్రమల అవసరాలకోసం ఓ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని ట్రాన్స్‌కో నిర్ణయించింది. దీనికి అవసరమయ్యే స్థలం చాలా తక్కువ. పైగా ఈ స్థలాన్ని ట్రాన్స్‌కో స్వయంగా సమకూర్చుకోవాలి. లేదంటే పక్కనే ఉన్న పోర్టు భూములు కావాలని కలెక్టర్‌ను కోరాలి. కానీ దుమ్ములపేటలో ఓ ప్రైవేటు వ్యక్తికి ఉన్న భూమికి కోట్లలో లాభం వచ్చేలా చేయడానికి అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి రంగంలోకి దిగారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధం లేని కార్పొరేషన్‌ను రంగంలోకి దించారు. దీని ద్వారా ప్రభుత్వ స్థలానికి బదులు తనకు కావాల్సిన వ్యక్తి ప్రైవేటు భూమి సేకరించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. దుమ్ములపేటలో 4.67 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించారు. గజం రూ.28వేల మార్కెట్ ధర చొప్పున 1:4 నిష్పత్తిలో రూ.251కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను సదరు ప్రైవేటు వ్యక్తికి జారీ చేసేశారు. ప్రభుత్వ భూములు ఉన్నా కాదని, ఓ ప్రైవేటు వ్యక్తి భూమికి మేలు చేకూర్చి భారీగా సదరు నేత తెరవెనుక డబ్బులు గుంజేశారు.

పక్కా ఆధారాలతో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకులోను రూ.700కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను గత ప్రభుత్వ హయాంలో అధికారులు జారీ చేశారు. దీనివెనుక కుంభకోణం జరిగిందని ఇప్పటికే కూటమి ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. అందులోభాగంగా వీటి విలువను భారీగా కుదించాలని తాజాగా నిర్ణయించింది. దీనివెనుక ఎవరెవరున్నారనే దానిపైనా విచారణకు ఆదేశించింది. ఈనేపథ్యంలో కాకినాడ టీడీఆర్ బాండ్లపైనా విచారణకు వేగంగా అడుగులు పడుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలో రూ.411కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను అధికారులు ఎలా అడ్డగోలుగా జారీ చేశారు? దీనివెనుక అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఎలా చక్రం తిప్పారు? అనేదానిపై ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వివరించారు. పక్కా ఆధారాలతో వివరాలు అందించారు. దీనిపై విచారణ చేపట్టి బాండ్ల కుంభకోణం నిగ్గుతేల్చాలని కోరారు. దీంతో సీఎం ప్రధాన కార్యదర్శి అయిన ముద్దాడ రవిచంద్రను ఈ కుంభకోణం సంగతి తేల్చాలని చంద్రబాబు ఆదేశించారు. దీంతో కాకినాడ టీడీఆర్ బాండ్ల కథ కూడా త్వరలోనే బయటకు రానుంది. ఇక్కడ కూడా తణుకు తరహాలోనే రూ.411కోట్ల విలువైన బాండ్లను సగానికిపైగా విలువకు కుదించవచ్చని తెలుస్తోంది. అడ్డగోలుగా బాండ్లు జారీ చేసిన అధికారులపైనా విచారణ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



గొల్లప్రోలు-తాటిపర్తి మధ్య ముంపులో ఉన్న వరి పొలాలు

పొలాల్లో తగ్గని.. వరద ముంపు

- సుద్దగడ్డ స్వల్పంగా తగ్గుముఖం
- జగనన్న కాలనీ రహదారిపై నీటి ప్రవాహం
- బోటులోనే కొనసాగుతున్న రాకపోకలు
- సూరంపేట చుట్టూ వరద నీరు

గొల్లప్రోలు, సెప్టెంబరు 3: సుద్దగడ్డ వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. పంటపొలాల్లో ముంపు తగ్గలేదు. జగనన్న కాలనీ రహదారులపై వరద నీరు భారీగా ప్రవహిస్తుండటంతో బోటులోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

రెండురోజులుగా వర్షాలు కురిసినా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న జలాలతో ఉధృతంగా ఉన్న సుద్దగడ్డ వరద మంగళవారం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీ రహదారులపై ఆరు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తుండడంతో బోటులోనే రాకపోకలు సాగిస్తున్నారు. ట్యాంకర్లకు వరద నీటిలో పైపులు వేసి కాలనీ వాసులు తాగునీటిని అందిస్తున్నారు. శివాలయమాన్యం కాలనీవద్ద రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండగా అందులోనే రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణ శివారు సూరంపేట చుట్టూ వరద నీరు తగ్గలేదు. రైల్వేట్రాక్ ఇరువైపులా, ఊబంద బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో సూరంపేటవాసులు పట్టణంలోకి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటపొలాల్లో ముంపు కొనసాగుతోంది. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో ముంపు తగ్గకపోగా, గొల్లప్రోలు-తాటిపర్తి మధ్య పంటపొలాల్లో ముంపు స్వల్పంగా తగ్గింది. గొల్లప్రోలు-తాటిపర్తి, చెందుర్తి-తాటిపర్తి రహదారుల పై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధ, గురువారాల్లో వరద పూర్తిగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని చెప్తున్నారు.

ఏలేరుకు జలకళ

ఏలేశ్వరం, సెప్టెంబరు 3: ఏలేరు ప్రాజెక్టులో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి నిల్వలు పెరిగాయి. ఈ ఏడాది వేసవికాలంలో ప్రాజెక్టులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 4991 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో ప్రాజెక్టులో మంగళవారం నాటికి 86.56 మీటర్లకుగాను 84.20 మీటర్లు, 24.11 టీఎంసీలకుగాను 19.50 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. వర్షపాతం ఎక్కువగా ఉండడంతో దిగువ ఆయకట్టు పంపా, తిమ్మరాజు చెరువుకు నీటిని నిలిపివేశారు.



ఏలేరులో పెరిగిన నీటి నిల్వలు

మిర్చి.. అధరహో!

- మెట్టలో సమృద్ధిగా పంట
- రైతుల్లో ఆనందం



జగ్గంపేటలో మిర్చితోట



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న మిర్చి

జగ్గంపేట, సెప్టెంబరు 3: మిర్చి ధర ఆశాజనకంగా ఉండడంతో మెట్ట రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. మెట్టప్రాంతమైన జగ్గంపేటలో పచ్చిమిర్చి పంటలు స్థానికులు విరివిగా వేస్తుంటారు. ప్రస్తుత తరుణంలో జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో 500 ఎకరాల మేర మిర్చిపంట చేతికి అందే స్థాయిలో ఉంది. ప్రస్తుత ధర పది కిలోలు రూ.450 చొప్పున కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులు ముందుకు వచ్చారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నాయి. కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో పంట సమృద్ధిగా పండడంతో మొదటి పూతలోనే తాము పెట్టిన పెట్టుబడులు చేతికి అందుతాయని మిరప రైతులు ఆశిస్తున్నారు. కాట్రావులపల్లినగర్, గుర్రంపాలెం, గొల్లలగుంట ప్రాంతాలతోపాటు గండేపల్లి మండలాల్లో నల్లరేవడి ఉన్న పొలాల్లోను ఈ పంటను అధికంగా వేశారు. మంగళవారం నుంచి అధిక శాతం కోత దశకు చేరింది. ఇటీవల రాష్ట్రంలో అకాలవర్షం, వరదలు రావడంతో ఇక్కడి మిర్చి పంటకు మంచి గిరాకీ ఉంటుందని రైతులు భావిస్తున్నారు. దీంతో మెట్ట రైతులకు కొంత ఉపశమనం కలిగినట్లేనని పలువురు అంటున్నారు. చాలాచోట్ల అధిక వర్షాల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. కానీ మెరక ప్రాంతంలో నీరు నిల్వ ఉండకపోవడంతో వీటిని అనుకూలంగా చేసుకుని బీర, బెండ, వంగ, ఆనబ, దోసకాయ, బీన్స్ వంటి పంటలకు కూడా ప్రస్తుత తరుణంలో మంచి ధర పలుకుతోందని రైతులు చెప్తున్నారు.

గమ్యం చేరేదెలా?

తెలుగు రాష్ట్రాల్లో కురిసిన భారీవర్షాలు రైల్వే వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశాయి. రైల్వేశాఖ పలు రైళ్లను రద్దు చేసింది. అనేక రైళ్లను దారిమళ్లించింది. దీంతో ప్రయాణికులు చాలా సమస్యలు ఎదు ర్కొంటున్నారు. అనేక రైళ్లను చిన్నచిన్న స్టేషన్లలో అర్ధంతరంగా నిలిపివేయడంతో ఆహారం అందక కాలకృత్యాలు తీర్చుకునే అవకాశాలు లేక ఇబ్బందులు పడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో కురిసిన వర్షాలు విజయవాడ రైల్వే డివిజన్‌ను అతలాకుతలం చేశాయి. సోమవారం సాయంత్రం నాటికి 481 రైళ్లను రద్దు చేసి 152రైళ్లను దారిమళ్లించినట్లు, 13రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.



నిర్మానుష్యంగా ఉన్న సామర్లకోట రైల్వే స్టేషన్

- వరద ఉధృతితో రైళ్ల రద్దు
- పలు రైళ్ల దారి మళ్లింపు
- అగమ్యగోచరంగా ప్రయాణికుల పరిస్థితి
- బస్సుల రాకపోకలకూ ఇదే తీరు

సామర్లకోట, సెప్టెంబరు 3: వరద ఉధృతి కొన్నిచోట్ల ఏకంగా రైలు పట్టాలను రూపులేకుండా చేశాయి. పలు వంతెనలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. దీంతో విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నిత్యం వందలాది రైళ్ల రాకపోకలను మూడురోజులుగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించడంతో ఆయా ప్రాంతాలనుంచి తమ గమ్యస్థానాలకు వెళ్లాల్సినవారు, తిరుపతి తదితర పుణ్యక్షేత్రాలకు నెలల తరబడి ముందుగా స్లాట్ రిజర్వేషన్ టిక్కెట్లు పొందినవారు, అత్యవసరంగా ప్రధాననగరాల్లో ఉన్నత చికిత్సలు నిర్వహించుకునేవారు, ఆయా ఉద్యోగాల్లో విధుల్లో చేరాల్సినవారు ఇలా ఎక్కడివారు అక్కడే చందాన స్తంభించిపోయారు. రైలు కాకుంటే బస్సు ఎక్కైనా బయలుదేరదామని ప్రయత్నిస్తుంటే పలు ప్రాంతాల్లో రహదారులు కిలోమీటర్ల పైబడి వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో ప్రయాణాలపై ఎటువంటి ఆశలు లేకుండా పోయాయి. దీంతో మరో మూడు రోజుల వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుందేమోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణాన్నైనా రైళ్ల రాకపోకలు పునరుద్ధరిస్తారా అని పలువురు ప్రయాణికులు కాకినాడ, సామర్లకోట, తుని, రాజమహేంద్రవరం వంటి ప్రధాన స్టేషన్లలోనే కాదు పిఠాపురం, అన్నవరం, బిక్కవోలు, అనపర్తి తదితర చిన్నస్టేషన్లలో రైల్వేఅధికారులనుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. విశాఖ, కాకినాడనుంచి సామర్లకోట మీదుగా తిరుపతి పుణ్యక్షేత్రాలకి వెళ్లే రైళ్లల్లో ఇక్కడి నుంచే అధికమంది భక్తులు నెలల ముందుగానే రిజర్వేషన్ టిక్కెట్లు పొందుతారు. అందుకు అనుగుణంగానే తిరుపతిలో దేవుడి దర్శనాలకు, వివిధ సేవలకు హాజరయ్యేందుకు కూడా అదే రీతిలో ముందుగానే రిజర్వేషన్ పొందుతారు. వరద ఉధృతి కారణంగా రోజుల తరబడి రైళ్లను రద్దు చేయడంతో వారంతా అయోమయంలో పడ్డారు.

కదలని రైళ్లు.. నిలిచిన ఎగుమతులు

సామర్లకోట మీదుగా అటు విశాఖకు, ఇటు విజయవాడలకు నిత్యం 40 రైళ్ల వరకూ రాకపోకలు సాగిస్తుండగా ఇంకా వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు మరో 10 వరకూ ఉన్నాయి. ఈ రైళ్లల్లో ప్రతిరోజూ సామర్లకోట జంక్షన్‌కు 10 వేల నుంచి 15 వేలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రైళ్ల రద్దుతో రాకపోకలు లేక, ప్రయాణికులు లేక సామర్లకోట స్టేషన్ నిర్మానుష్యంగా మారింది. ఆయా రైళ్లల్లో ప్రయాణికులకు ఆహారపదార్థాలను విక్రయించేందుకు ఉన్నస్టాల్స్ వద్ద కొనుగోళ్లు లేక వాటిపై ఉపాధి పొందుతున్న సిబ్బందికి మూడురోజులుగా ఉపాధి కొరవడింది. స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీ సామాగ్రి మోస్తూ సేవలందించే లైసెన్స్ పోర్టర్లు సైతం రైళ్లు లేక మూడు రోజులుగా ఒక్క రూపాయి ఉపాధి లేక తల్లడిల్లుతున్నారు. ఇదే రీతిలో ప్రయాణికులకు సేవలందించే ఆటోలు, ట్యాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లు మూడురోజులుగా ఏ ఉపాధి లేక సతమతమవుతున్నారు. ఇక్కడినుంచి వివిధ రాష్ట్రాలకు సముద్ర ఆహార ఉత్పత్తులైన పచ్చి చేపలు, పీతలు మాత్రమే కాకుండా పశ్చిమబెంగాల్‌కు నిత్యం ఎగుమతులు అయ్యే బాతు గుడ్ల ఎగుమతులు మూడురోజులుగా స్తంభించాయి. దీంతో బాతుగుడ్లు రోజుల తరబడి నిల్వలు ఉంటే పాడయ్యే ప్రమాదం ఉందని పలువురు వ్యాపారులు వాపోయారు.

వరద ఉధృతి కారణంగా ప్రయాణికుల రైళ్లకే కాదు రవాణాకు వినియోగించే గూడ్స్ రైళ్లను సైతం నిలిపివేయడంతో ఎక్కడి రవాణా అక్కడే చందాన తయారైంది. దీంతో సామర్లకోట, కాకినాడ రైల్వేస్టేషన్లకు కోట్లాది రూపాయల మేర ఆదాయం పడిపోయింది. కాకినాడ పోర్టు రైల్వేలైన్ ద్వారా ఆదాయ వనరుల సమీకరణలో విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ఎంతో కీలకమైంది. వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చే సరుకులు మాత్రమే గాక ఇక్కడినుంచి వివిధ రాష్ట్రాలకు ఎగుమతులకు రవాణా మార్గాలు మూసుకుపోయాయి. సామర్లకోట స్టేషన్‌కు మధ్యప్రదేశ్ నుంచి గోధుమలు, పంజాబ్, హర్యానా నుంచి ధాన్యం దిగుమతులు అధికంగా అవుతుండేవి. రైళ్ల రద్దు కారణంగా నాలుగురోజులుగా రైల్వే గూడ్స్‌యార్డ్ నిర్మానుష్యంగా మారింది. ఈ గూడ్స్ యార్డ్ ఆధారంగా ఎగుమతులు, దిగుమతులతో 200మంది హమాలీ కూలీలకు ఉపాధి కొరవడింది. ఏది ఏమైనా విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో విజయవాడ తర్వాత రైల్వేకు అత్యధికంగా నష్టం వాటిల్లిన స్టేషన్లలో సామర్లకోట, కాకినాడ స్టేషన్లు ప్రధానంగా ఉండడాన్ని ఇప్పటికే రైల్వే అధికారులు గుర్తించారు.

వరదబాధితులకు లక్ష ఆహార పొట్లాల సరఫరా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 3: సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ షాన్ మోహన్ నేతృత్వంలో కాకినాడ ఆర్‌డీవో, పౌరసరఫరాలశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు లక్ష ఆహార పొట్లాలు సరఫరా చేశారు. ట్రిప్పుకు 30వేలకుపైగా ఆహార పొట్లాల చొప్పున ప్రత్యేక వాహనంలో తరలించారు. విజయవాడకు నిరంతరాయంగా ఆహార పంపిణీ ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లకు ఎప్పటికప్పుడు ఆర్డీవో ఇట్ల కిషోర్ పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వరద బాధితుల సహాయక చర్యల నిమిత్తం రెవెన్యూ, పోలీస్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో ఆదివారం రాత్రి కాకినాడ నుంచి 18 బోట్లు విజయవాడకు పంపారని తెలిపారు. కేటరింగ్ యాజమాన్యాలతో, లారీ యూనియన్ వాళ్లతో మాట్లాడి సోమవారం ఉదయం 30వేలకు పైగా ఆహార పొట్లాలు పంపామని తెలిపారు. అదే రోజు సాయంత్రం 30వేల ప్యాకెట్లు, మంగళవారం 30వేల ప్యాకెట్లు పంపామని చెప్పారు. ఆహార పొట్లాల సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.

విజయవాడకు శానిటరీ సిబ్బంది

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 3: కాకినాడ నుంచి 175 మంది శానిటరీ సిబ్బంది విజయవాడకు మంగళవారం బయలుదేరి వెళ్లినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. వీరిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు ఉన్నారు. వరద ప్రభావిత ప్రాంతంలో శానిటరీ విభాగంలో వీరు సేవలు అందించనున్నారు.

ఉపాధి హామీలో ఎక్కువ కుటుంబాలకు పనిదినాలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 3: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఎక్కువ కుటుంబాలకు పనిదినాలు కల్పించి, పనుల్లో పురోగతి కనబరచాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌నుంచి మంగళవారం కలెక్టర్ షాన్ మోహన్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్లు ఇతర పనుల్లో పురోగతి చూపాలన్నారు. మండలాలవారీగా ఎక్కువ కుటుంబాలకు వందరోజులు పనిదినాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తప్పనిసరిగా మ్యాన్ డేస్ జనరేషన్ జరగాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పురపాలక, మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ గురుకుల, కేజీబీవీ వసతిగృహాల్లోని తాగునీటి ట్యాంకులకు క్రమం తప్పకుండా క్లోరినేషన్, శుభ్రం చేయడంతోపాటు తాగునీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, డీపీవో భారతిసౌజన్య, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ పథకంలో నాణ్యమైన ఆహారం: ట్రైనీ కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 3: జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకానికి సంబంధించి నాణ్యతతో, రుచికరమైన ఆహారాన్ని పాఠశాల విద్యార్థులకు అందించాలని ట్రైనీ కలెక్టర్ భావనా సూచించారు. కలెక్టరేట్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమం అమలుపై మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల తల్లుల కమిటీ ఛైర్మన్లు, కుకింగ్ ఏజెన్సీలకు వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాబ్‌ల నిర్వాహకులు ప్రతి విషయం తెలియపర్చాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 3: జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్‌ల వ్యాధుల వివరాలైన డెంగ్యూ, డయేరియా, టైఫాయిడ్, మలేరియా, స్వైన్‌ఫ్లూ, క్షయ, హెపటైటిస్, కుక్కకాటు, పాము కాటు వంటి వ్యాధుల వివరాలు ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్(ఐడీఎస్‌పీ) వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. అవుట్ పేషెంట్‌లోను లేదా ఇన్ పేషెంట్‌లోను నమోదైన అంటువ్యాధుల ఫారం-పీలో ల్యాబ్‌లో పరీక్షించిన అంటువ్యాధుల వివరాలు ఫారం-ఎల్‌లో పొందుపర్చాలని సూచించారు. ఈ వివరాలు జిల్లా, రాష్ట్ర, కేంద్ర అధికారులు, డబ్ల్యుహెచ్‌వో ప్రతినిధులు పరిశీలిస్తారన్నారు. ఈ వ్యాధుల వివరాలు వెబ్‌పోర్టల్‌లో సక్రమంగా పొందుపర్చాలన్నారు. తద్వారా తగు నివారణ చర్యలు చేపట్టి అంటువ్యాధులను అరికట్టి అంటు వ్యాధుల రహిత జిల్లాగా అందరి సహకారంతో సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యం దిశగా కృషి చేద్దామన్నారు. సమాచారాన్ని (https://ihip.mohfw.gov.in/idsp) వెబ్‌పోర్టల్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ బండారు రవి కుమార్, డెమో ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎస్‌ఎస్ పరీక్షకు 17 వరకూ దరఖాస్తు గడువు పెంపు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 3: ఎన్‌ఎంఎస్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 17 వరకూ పెంచినట్లు డీఈవో పిల్లి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన పరీక్ష డిసెంబరు 8న జరుగుతుందన్నారు. వివరాలకు కాకినాడ డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వరద బాధితులకు రూ.7లక్షల విరాళాలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 3: వరద ప్రభావిత ప్రజలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నున్న రామకృష్ణ, సెక్రటరీ మొగలి నాని, కాకినాడ ఏరియా అధ్యక్షుడు మేదరపాటి బాబి రూ.5లక్షల చెక్కును కలెక్టర్ షాన్‌మోహన్‌కు మంగళవారం అందజేశారు. పట్టాభి ఓవర్సీస్ సంస్థ వారి తరుపున ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీవీఎస్కే. గోవిందరాజు లక్ష రూపాయల చెక్కును, ఏపీ ఎస్‌డబ్ల్యూసీ సామర్లకోట ఇన్వెస్టర్ గోడౌన్ల తరపున బి.శ్రీనివాసరావు రూ.లక్ష, బాలాజీ ట్రాన్స్‌పోర్ట్ ప్రొప్రైటర్ వల్లా బాబ్జి రూ.10వేల చెక్కును అందజేశారు. భారీవర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా నిరాశ్రయులైన బాధితులను ఆదుకునేందుకు దాతృత్వంతో దాతలు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన దాతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ డీఎం బాలసరస్వతి పాల్గొన్నారు.



పచ్చని కొండలపై పాల నురగలా

మెట్టలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తూర్పు కనుమల్లో ప్రకృతి సోయగాలకు కొదవ లేదు. ఊటీని తలపించే అందాలు కట్టిపడేస్తున్నాయి. తుని రూరల్ ఎర్రకోనేరు వద్ద పచ్చని కొండలపై పాల నురగలా తేలియాడతూ మంచు సోయగాలు మురిపిస్తున్నాయి. కొత్త అందాలు సంతరించుకున్న ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను పరవశింప చేస్తోంది. - తుని రూరల్

విశాఖ-విజయవాడ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, సెప్టెంబరు 3: వరదలల కారణంగా ఇప్పటికే మూడు రోజులుగా పలు రైళ్లను రద్దు చేసిన నేపథ్యంలో ప్రయాణికులకు కాసింత వెసులుబాటు కల్పించేందుకు మంగళవారం నుంచి విశాఖ-విజయవాడల మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతున్నట్లు రైల్వే సీపీఆర్వో రమేష్ ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ రమేష్ మంగళవారం అందించిన సమాచారం మేరకు ఈ ప్రత్యేక రైలు 08581తో విశాఖ నుంచి మంగళవారం మధ్యాహ్నం 12.55కి బయలు దేరిందన్నారు. సాయంత్రం 3.14కి సామర్లకోటకు చేరుకుని తిరిగి విజయవాడకు బయలుదేరింది. రాత్రి 7.15కి విజయవాడకు చేరుకుంటుందన్నారు. ఈ ప్రత్యేక రైలు పట్ల ముందస్తు సమాచారం లేకపోవడంతో రైలు ఖాళీగా విజయవాడకు తరలివెళ్లింది.

గౌతమి ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

కాకినాడపోర్టు-లింగంపలి-కాకినాడ పోర్టు మధ్య రాకపోకలు సాగించే 12737, 12738 నంబర్లు గల గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంగళవారం రాత్రి నుంచి దారి మళ్లిస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులను సామర్లకోట రైల్వేస్టేషన్‌కు మంగళవారం రాత్రి జారీ చేశారు. భారీవర్షాల కారణంగా చేసిన ఈ మార్పుల కారణంగా కాకినాడ నుంచి బయలుదేరే గౌతమి ఎక్స్‌ప్రెస్ విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో గౌతమి ఎక్స్‌ప్రెస్ పగిడిపల్లి, గుంటూరు, విజయవాడల మీదుగా తిరిగి సామర్లకోట చేరుకుంటుందన్నారు.



శ్రీపాద శ్రీవల్లభులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీపాద శ్రీవల్లభులకు
సహస్ర చామంతి పుష్పపూజ

పిఠాపురం, సెప్టెంబరు 3: కాకినాడజిల్లా పిఠాపురంలో శ్రీపాదవల్లభులకు చామంతి పుష్పాలతో పూజ జరిగింది. పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం విశేషపూజలు జరిగాయి. సహస్ర చామంతి పుష్పపూజ నిర్వహించారు. శ్రీపాదవల్లభుని పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే మూల మంత్ర అనుష్టానం జరిగాయి. సాయంత్రం పల్లకిసేవ జరిగింది. భక్తులు గురుచరిత్ర, శ్రీపాదవల్లభ చరితామృత గ్రంధ సామూహిక సప్తాహ పారాయణం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య పాల్గొన్నారు.

సత్యదేవుడి హుండీలలో
భారీగా విదేశీ కరెన్సీ

● ఏటా రూ.40 లక్షల వరకు ఆదాయం

అన్నవరం, సెప్టెంబరు 3 : రత్నగిరివాసుడైన సత్యదేవుడు తెలుగుప్రజల ఆరాధ్య దైవంగానే కాకుండా విదేశీయుల తాకిడి క్రమంగా పెరుగుతూనే ఉంది. దీనికి ప్రధానంగా హుండీలలో విదేశీభక్తులు వేసే వివిధ దేశాల కరెన్సీ లభ్యమవడమే నిదర్శనం. గతంలో విదేశీ కరెన్సీ విలువ ఏడాదికి 5నుంచి ఆరులక్షలు మాత్రమే వస్తోండగా ప్రస్తుతం ఈ ఆదాయం రూ.40 లక్షలకు చేరుకుంటుంది. విదేశీ కరెన్సీలో అధిక భాగం యుఎస్ఏ డాలర్లదే కావడం గమనార్హం. తరువాత స్థానంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన దిరహమ్స్, సింగపూర్, కెనడా, మలేషియా, రష్యాలున్నాయి. విదేశీయులు స్వామివారి దర్శనం అనంతరం వారి దేశ కరెన్సీను హుండీలో సమర్పించి వారి దగ్గరున్న ఇండియన్ రూపీస్‌తో ఇతర అవసరాలకు వినియోగించుకుంటారు. వీటిని దేవస్థానం ఏవిధంగా భారత కరెన్సీగా మారుస్తుంది అనే అనుమానం రావచ్చు. దేవస్థానం అధికారులు ఏ నెలకు ఆనెల హుండీలను తెరిచి సిబ్బందితో లెక్కించి యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్‌లలో రొటేషన్ విధానంలో ఒక్కోనెల ఒక్కో బ్యాంక్‌లో జమచేస్తుంటారు. హుండీల లెక్కింపు సమయంలో వచ్చిన విదేశీకరెన్సీని ఆయా బ్యాంక్‌లు స్వీకరించి ఆరోజు విదేశీకరెన్సీలో ఏదేశ కరెన్సీ విలువ ఎంతుందో అంతే మొత్తాన్ని ఇండియన్ రూపీస్‌లో లెక్కకట్టి దేవస్థానం ఖజానాకు జమచేస్తారు. తరువాత వాటిని బ్యాంక్ అధికారులు రిజర్వ్‌బ్యాంక్‌కు పంపుతారు. హుండీల లెక్కింపులో అన్నిదేశాల విదేశీ కరెన్సీల విలువ నెలకు సుమారు రూ.40లక్షల వరకు ఉంటుందని అకౌంట్ విభాగ అధికారులు పేర్కొంటున్నారు.



హుండీల ద్వారా లభించిన కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

2016లో డీ మోనటైజేషన్‌లో రద్దయిన నోట్లు రూ.10లక్షలు

అన్నిరకాల నోట్లను దేవస్థానం నగదుగా మూర్చుకుంటున్న 2016లో ప్రధాని మోదీ నోట్ల రద్దు ప్రకటించిన రూ.500, రూ. 2000 నోట్లు ఇంకా హుండీలలో అక్కడక్కడా కనిపిస్తుండడం విశేషం. నోట్లు రద్దు తరువాత బ్యాంక్‌లు కొద్దికాలం వీటిని స్వీకరించినా గడువు ముగిసిన తరువాత విచ్చలవిడిగా దేశీయభక్తులు అవి బయట చెల్లుబాటుకాకపోవడంతో హుండీలలో సమర్పించేవారు. ఆ సమయంలో బ్యాంక్‌లు వీటిని తీసుకోకపోవడంతో అవి దేవస్థానం ఖజానాలో మూలుగుతున్నాయి. సుమారు రూ.10లక్షల వరకు ఆ నోట్లు దేవస్థానం లాకర్లలోనే ఉన్నాయి. దేవస్థానం అధికారుల బృందం రిజర్వ్‌బ్యాంక్ ప్రతినిధుల వద్దకు వెళ్లి వీటి గురించి ప్రస్తావించినా వారు కూడా తీసుకోకపోవడంతో దేవస్థానంలోనే ఉంచారు.

వరద బాధితుల కోసం
అన్నవరం దేవస్థానం ఆపన్నహస్తం

● 10వేల పులిహోర ప్యాకెట్లు, 40 వేల వాటర్ ప్యాకెట్లు తరలింపు



పులిహోర ప్యాకెట్ల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, సెప్టెంబరు 3: అల్పపీడన ప్రభావం విజయవాడను అతలాకుతలం చేయడంతో అక్కడ వరదబాధితుల కోసం అన్నవరం దేవస్థానం ఆపన్నహస్తం అందించి తనవంతు పాత్ర పోషించింది. దేవస్థానం ప్రత్యేక వాహనాల ద్వారా అన్నవరంలో 10వేల పులిహోర ప్యాకెట్లను తయారు చేయించింది. దీంతోపాటుగా 40వేల వాటర్ ప్యాకెట్లను ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకెళ్లారు. ఈ వాహనాన్ని మంగళవారం ఉదయం ఈవో రామచంద్రమోహన్ జెండాఊపి ప్రారంభించారు. దేవస్థానం నుంచి కొందరి సిబ్బందిని ఆ వాహనాలలో పంపించి వారే నేరుగా బాధితులకు అందేలా చేయాలని ఈవో ఆదేశించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దేవస్థానాల నుంచి ఆపన్నహస్తం అందించడం ఎప్పటినుంచో చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

సత్యదేవుడి ప్రసాదానికి దేశఖ్యాతి

● అన్నవరం ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పత్రం అందజేత

అన్నవరం, సెప్టెంబరు 3: భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి ప్రకటించిన గుర్తింపు పత్రాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్‌లకు అందజేశారు. సత్యదేవుడి ప్రసాదానికి దేశఖ్యాతి లభించడం అభినందనీయమని దేవస్థానం అధికారులు సిబ్బంది ఈ ఖ్యాతిని మరింత విస్తరించేందుకు కృషిచేయాలన్నారు. ఈవో రామచంద్రమోహన్ మాట్లాడుతూ భారత ఆహార సంస్థ సూచనలతో రుచి, శుచి, నాణ్యతతో ప్రసాదం తయారీచేస్తున్నామని వారు రెండేళ్లకు ఒకసారి దీనిపై ఆడిట్‌చేసి గుర్తింపుపత్రం రెన్యువల్ చేస్తుంటారని స్వచ్ఛమైన, అమృతమైన స్వామివారి గోదుమరవ్వ ప్రసాదం తయారీలో రాజీపడబోమని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ రోహిత్, పీఆర్వో కృష్ణారావు, నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే సత్యప్రభ స్వామిని దర్శించుకోగా వారికి ఆలయ ఈవో రామచంద్ర మోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.



ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పత్రాన్ని ఈవో, ఛైర్మన్‌లకు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

పెరుగుతున్న గోదావరి

● 2,99,814 క్యూసెక్కుల నీరు దిగువకు..

ధవళేశ్వరం, సెప్టెంబరు 3: ఉపనదులు ప్రాణహిత, మంజీర నుంచి వరద నీరు గోదావరికి చేరుతుండడంతో కాళేశ్వరంవద్ద నీటి మట్టం పెరుగుతుంది. దీని ప్రభావంతో ఎగువున భద్రాచలంవద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చి చేరే వరద నీటి ప్రవాహాన్ని అంచనావేస్తూ ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ మొత్తం 175 గేట్లను ఆర్‌క్లియర్ పొజిషన్‌లో ఉంచి గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. దీంతో మంగళవారం ఉదయం 7.20 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రానికి 6.20అడుగులుగా నమోదు కాగా 2,99,814 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద సుమారు 9లక్ష క్యూసెక్కుల వరద తరలిరావచ్చని, 11అడుగులకు పైగా నీటి మట్టం చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద తెల్లవారుజామున 2గంటలకు నీటిమట్టం 25.70అడుగులుగా ఉండగా సరాసరి గంటకు 1పాయింట్ చొప్పున పెరుగుతూ సాయంత్రం 6గంటలకు 38.50అడుగులకు చేరుకుంది. మొదటి ప్రమాదహెచ్చరిక స్థాయి 43 అడుగుల వరకు నీటిమట్టం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

రూ.18 లక్షలకే
కేజీ బంగారం అంటూ కుచ్చు టోపీ

● ఈజీ మనీ కోసం మోసపోయిన ఆర్ఎంపీ వైద్యుడు

కూనవరం, సెప్టెంబర్ 3: ఈజీ మనీ కోసం ఓ నలుగురు రూ.18లక్షలకే కేజీ బంగారం వస్తోందనే ఆశతో వారి ఉచ్చులోపడి మోసపోయిన సంఘటన కూనవరంలో చోటుచేసుకుంది. అల్లూరి జిల్లా కూనవరం మండలానికి చెందిన ఓ ఆర్ఎంపీ వైద్యుడితోపాటు మరో ముగ్గురు ఈ మోసం ఉచ్చులో పడిపోయారు. మండలంలో నివశిస్తున్న ఈ వైద్యుడి దగ్గరకు పిట్టల మందు అమ్ముకునే ఓ వ్యక్తి వచ్చాడు. కొంతసేపు ఆర్ఎంపీ వైద్యుడితో మాట్లాడాక నా దగ్గర రూ.18లక్షలకే కేజీ బంగారం ఉందని ఆ సొమ్ము ఇస్తే బంగారం ఇస్తానంటూ నమ్మించాడు. ఆ మాయమాటల్లో పడిపోయిన ఆర్ఎంపీ వైద్యుడు మరో ముగ్గురు స్నేహితులకు ఈవిషయాన్ని చెప్పాడు. అందరూ చర్చించుకుని ఎక్కువ బంగారం వస్తోందన్న ఆశతో ఈ డీల్ కుదుర్చుకున్నారు. ఆ బంగారం బెంగుళూరులో ఉందని పిట్టల మందు అమ్ముకునే వ్యక్తి తెలిపారు. ఈ నలుగురు రెండుసార్లు బెంగుళూరు వెళ్లారు. అనంతరం బెంగుళూరు, ఆంధ్రా సరిహద్దుల్లో బంగారం తనిఖీ చేసుకునేందుకు సిద్ధపడ్డారు. బెంగుళూరుకు చెందిన కొంతమంది వ్యక్తులు బంగారం పరిశీలించుకోవడానికి రెండు బంగారు ముక్కలు ఇచ్చారు. అవి ఒరిజినల్ కావడంతో మిగతా ఆ కేజీ బంగారం పరిశీలించకుండా తీసుకొచ్చారు. తీరా ఇంటికొచ్చాక ఆ బంగారం నకిలీ కావడంతో నిండా మోసపోయామంటూ ఇప్పుడు లబోదిబోమంటున్నారు.

వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాలకు
1,600 అరటి గెలలు

రావులపాలెం, సెప్టెంబరు 3: వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాలకు రావులపాలెం నుంచి అరటి గెలలను తరలించారు. మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు ఆర్జేడీఎం పి.సుధాకరరావు పర్యవేక్షణలో కోనసీమ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి పి.విశాలాక్షి, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.యశ్వంతరావు రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో 1.600 కర్పూర రకం అరటి గెలలను కొనుగోలు చేశారు. మంగళవారం వాటిని లారీల్లో వర్ష ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. కార్యక్రమంలో అంబాజీపేట, ఆలమూరు ఉన్నత శ్రేణి కార్యదర్శులు ఐ.రమేష్, గోవిందరెడ్డి, సూపర్‌వైజర్లు వి.శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.



రావులపాలెం అరటి మార్కెట్‌యార్డు నుంచి విజయవాడ తుఫాన్ ప్రభావిత ప్రాంతానికి తరలించేందుకు సిద్ధం చేసిన అరటి గెలలు

యువకుడి దాడిలో
వృద్ధురాలి మృతి

తుని రూరల్, సెప్టెంబరు 3: యువకుడి దాడిలో వృద్ధురాలి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట పంచాయతీ శివారు గవరపేటలో జరిగింది. గవరపేటకు చెందిన వేగి ఆనంద్, తండ్రి నల్లబాబు పొలంలో అదే గ్రామానికి చెందిన పక్క పొలం రైతు భార్య వేగి సుబ్బలక్ష్మి(68)కి ఆనంద్‌కి మధ్య స్థలవివాదంపై ఘర్షణ చోటు చేసుకోవడంతో మంగళవారం ఆనంద్ సుబ్బలక్ష్మిపై దాడి చేయడంతో సుబ్బలక్ష్మి మరణించింది. దీంతో కుటుంబ సభ్యులు తుని రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కృష్ణామాచార్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకో పాలనలో వెనుదిరిగిన పరిశ్రమలను రప్పిస్తాం

● కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



మెగా దంత వైద్య శిబిరాన్ని సందర్శించి పళ్ళ సెట్టును అందజేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

అనపర్తి, సెప్టెంబరు 3: రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన సైకో పాలనతో అనేక పరిశ్రమలు తరలిపోయాయని మరికొన్ని పరిశ్రమలు పెట్టుబడి పెట్టేందుకు వెనుకంజ వేశాయని వీటన్నిటినీ తిరిగి ఆహ్వానించి పరిశ్రమలను నెలకొల్పి అనేక మందికి ఉపాధి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం అనపర్తి మండలం పొలమూరులోని శ్రీదేవి ఫంక్షన్ హాల్లో మూడు రోజులుగా నల్లమిల్లి మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా దంత వైద్యశిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నూతనంగా పెట్టుబడులు ఆకర్షించేందుకు ముఖ్యమంత్రితో కలిసి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు బుధవారం ప్రారంభంకానున్నాయని చెప్పారు. పొలమూరులో జరిగిన దంత వైద్య శిబిరంలో సేవలను పరిశీలించారు. రోగులకు ఉచితంగా అందించే పళ్ల సెట్లను మంత్రి అందజేశారు. నెల రోజులపాటు జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల మొత్తం వైద్య సేవలకు అంకితం కావడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ వేమగిరి-సామర్లకోట కెనాల్‌రోడ్డు అభివృద్ధికి మంత్రి సహకరించాలని కోరారు. దంత వైద్య శిబిరం నిర్వహించిన జీఎస్ఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. జీఎస్ఎల్ ట్రస్టు ఎంపీ డాక్టర్ సందీప్‌ను, మంత్రి శ్రీనివాసవర్మను ఘనంగా సత్కరించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు శివరామ కృష్ణంరాజు, సిరసపల్లి నాగేశ్వరరావు, ఆళ్ల గోవిందు, దత్తుడు శ్రీను, పాల్గొన్నారు.

పరిశ్రమ ఆధారిత కోర్సుల రూపకల్పనకు
రిలయన్స్‌తో ఎంవోయూ

● సమీక్షలో జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 3: వర్సిటీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా పరిశ్రమ ఆధారిత కోర్సుల రూపకల్పన, ఇంటర్న్‌షిప్స్, పరిశోధనలు, కన్సల్టెన్సీ సేవలు అందించేందుకుగాను త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నామని ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. గాడిమొగలోని రిలయన్స్ కార్యాలయంలో సంస్థ ప్రతినిధులతో మంగళవారం జేఎన్టీయూకే అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రిలయన్స్‌లోని స్కిల్డ్ ప్రొఫెషనల్స్‌కు ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులు అందించేందుకుగాను చర్చలు జరిపామన్నారు. అనంతరం రిలయన్స్ ప్రతినిధులు తమ సంస్థలో సంభవించే సాంకేతిక అవరోధాలకు సత్వరపరిష్కారం అందించాలని కోరారు. దీనిపై వర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించారు. సమీక్షలో ఓఎస్డీ కోటేశ్వరరావు, పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ వి.రవీంద్ర, సీఈ శ్రీనివాసులు, డైరెక్టర్లు గోపాలకృష్ణ, బీటీ కృష్ణ, చక్రవర్తి, వెంకటరెడ్డి రిలయన్స్ ప్రతినిధులు సుబ్బారావు, మురళీధర్, రెబెల్లో, ప్రసాద్, వేణుగోపాలరాజు పాల్గొన్నారు.



రిలయన్స్ ప్రతినిధులతో జేఎన్టీయూకే అధికారులు

అమలాపురంలో
క్షుద్ర పూజల కలకలం!



అమలాపురంలో క్షుద్ర పూజలు జరిగింది ఇక్కడే

అమలాపురంటౌన్, సెప్టెంబరు 3: జాతీయ రహదారిని ఆనుకుని అమలాపురం కళాశాల రోడ్డులో ఉన్న దుకాణ సముదాయం, ఇళ్ల వద్ద జరిగిన క్షుద్ర పూజలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న సందులో దారి పొడవునా గృహాలు, దుకాణాల ముందు నిమ్మకాయలు ఉంచి పసుపు, కుంకుమ చల్లి నల్లని తాళ్లు కట్టారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటి ముందు క్షుద్ర పూజలు నిర్వహించినట్టు భావిస్తున్నారు. ఎర్ర రంగు నీళ్లు, సూదులతో గుచ్చిన నిమ్మకాయలు, నల్లతాడుతో బంధించిన కోడిగుడ్లను పగులకొట్టడం... ఇలా ఎన్నో చేశారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వచ్చిన తంగెళ్ల సత్యనారాయణమూర్తి, మాణిక్యాలరావు కుటుంబ సభ్యులు తమ ఇంటి ముందు క్షుద్ర పూజలు జరిగాయని, కావాలని ఎవరో చేతబడి చేసినట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అమావాస్య అర్ధరాత్రి చేతబడులు చేశారనివారు ఆరోపిస్తున్నారు. తంగెళ్ల సోదరులు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ కె.క్రిష్టఫర్ తెలిపారు.

పిఠాపురంలో వ్యక్తిపై హత్యాయత్నం

పిఠాపురం, సెప్టెంబరు 3: కాకినాడజిల్లా పిఠాపురంలో ఒక వ్యక్తిపై హత్యాయత్నం కలకలం సృష్టించింది. పట్టణంలోని మంగాయమ్మారావుపేటకు చెందిన కొర్రా సత్యనారాయణ కొంతకాలంగా చిట్‌ఫండ్ కంపెనీ నిర్వహిస్తున్నారు. దీని విషయంలో రెండేళ్ల క్రితం వ్యాపార భాగస్వాముల మధ్య వివాదాలు తలెత్తగా కేసులు పెట్టుకున్నారు. ఇవి కోర్టులో ఉన్నాయి. మంగళవారం ఉదయం సత్యనారాయణ సాయిబాబా గుడి సెంటర్ వద్ద మోటార్‌సైకిల్‌తో ఉండగా అతని పార్టనర్ ఎల్.భాస్కర్ అనే వ్యక్తివచ్చి పాదగయ సెంటర్ వద్ద దించమని అడిగాడు. అతనిని మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని పిఠాపురం బైపాస్‌రోడ్డు మీదుగా వెళుతుండగా శ్రీచైతన్య స్కూలు వద్దకు వచ్చేసరికి భాస్కర్ కత్తి తీసుకుని సత్యనారాయణను పొడిచి అతనివద్ద ఉన్న రూ.1.50లక్షలను తీసుకుని పరారయ్యాడు. గాయపడిన సత్యనారాయణ చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. సత్యనారాయణ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనపై సీసీ కెమేరా దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చిట్‌ఫండ్ కంపెనీ వివాదాల నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నారు.

పసలపూడిలో పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయవరం, సెప్టెంబరు 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రాయవరం మండలం పసలపూడిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుని పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు రాయవరం ఎస్ఐ పి.బుజ్జిబాబు మంగళవారం రాత్రి తెలిపారు. గ్రామంలో బియ్యం అక్రమ రవాణ జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంపై విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో అక్రమంగా తరలిస్తున్న 3వేల 110 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ 1లక్షా 43వేల 60 రూపాయలు ఉంటుందని, రూ.4లక్షల విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని వాహన యజమాని నాగిరెడ్డి సీతారామయ్య, డ్రైవర్ బాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరద నీరే...తాగు నీరై

● తాగునీరు లేక సింగంపల్లి గ్రామస్థుల వెతలు
● ఉధృతంగా ప్రవహిస్తున్న మడేరు వాగు



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో నీరు సేకరిస్తున్న గ్రామస్థులు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు కొండ వాగులు ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్న సంగతి తెలిసిందే , అయితే మండలంలోని సింగంపల్లి గ్రామస్థులు మాత్రం తాగేందుకు మంచినీరు లేక వరద నీటిని తాగుతున్నారు. సింగంపల్లి గ్రామంలో సుమారు 600 మంది జనాభా ఉంటారు. ప్రధాన రహదారితో సంబంధం లేకుండా కాలువ ఆవల గ్రామం ఉండటంతో గ్రామంలో ప్రజలు ఏమైపోయినా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. ఆ గ్రామ ప్రజలకు మొదటి నుంచి తాగునీటికి ఇబ్బందులే. 2017లో ఐటీడీఏ ద్వారా గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటుచేశారు. అయితే ఆర్వో ప్లాంటు గత రెండేళ్లుగా పనిచేయట్లేదు. ఈ విషయాన్ని ప్రజలు అప్పటి అధికారులు, పాలకుల దృష్టికి తీసుకొని వెళ్లిన పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. దీంతో వారికి వేరే గత్యంతరం లేక సమీపంలో ఉన్న మడేరువాగు వద్ద సెలములు ఏర్పాటు చేసుకొని(వాగు సమీపంలో గొయ్యి తీసి) అక్కడ ఇంకిన నీటినే తేర్చి, గత రెండేళ్లుగా ప్రజలు తాగుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మడేరు వాగుకు వరద ప్రవహం పోటెత్తింది. దీంతో నీరు బురద, తదితర వ్యర్ధాలతో పూర్తిగా కలుషితమైంది. ఆ విషయం తెలిసిన తాగునీటికి వేరే ఆస్కారం లేక వరద నీటినే గ్రామస్థులు తీసుకొని వెళ్లి మంచినీటిగా సేవిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తాత్కాలికంగా ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని లేదా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సింగంపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న మడేరు వాగు

పౌష్టికాహారంపై అవగాహన

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 3: రేచర్లపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంపీఎల్ హైస్కూల్‌లో మంగళవారం కిశోర బాల, బాలికలకు రక్తహీనత లోపం వల్ల వచ్చే నష్టాలు, దాన్ని నివారణకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా పీడీ కె.ప్రవీణ, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ఆర్‌శైలజా బాలల హక్కులపై. ఎస్ఐ లక్ష్మి గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌పై వివరించారు. హెచ్ఎం, సెక్టార్ సూపర్‌వైజర్ కెఎస్ అరుణశ్రీ పాల్గొన్నారు.

ముంపు బారిన పంట పొలాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3: గత 5 రోజులగా భారీ వర్షాలకు ప్రత్తిపాడుకు చెందిన అన్నదాతలు కుదేలయ్యారు. సుద్దగడ్డ, వెంకన్నదొర చెరువు, సుబ్బారెడ్డిసాగర్ నీటి కాలువల ఉధృతి వల్ల ఖరీఫ్ వరి పంటలు ముంపు బారిన పడి కుళ్లిపోయే దశకు చేరుకున్నాయి. పెదశంకర్లపూడి ఊరచెరువు కాలువకు గతంలో గండిపడగా ఆ భారీ వర్షాలకు గండి రెట్టింపు కోతకు గురై ఆ గ్రామ పంట పొలాలను ముంచెత్తాయి. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో అవస్థల్లో మునిగిపోయారు. ప్రత్తిపాడు, టి.రాయవరం, టి.జగన్నాధపురం, లంపకలోవ, ఉత్తరకంచి, ఒమ్మంగి, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, పెద్దిపాలెం గ్రామాలకు చెందిన 1000 ఎకరాలు పైబడి వరి పంటలు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. పోతులూరు, వాకపల్లిలో మరో200 ఎకరాల ఆకాకర, చిక్కుడు కూరగాయల పంటలు ముంపు బారినపడి రైతులు నష్టపోయారు. మండలంలోని ప్రత్తిపాడు, రాయవరం పి. జగన్నాధపురం, లంపకలోవలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను తహశీల్దార్ సూర్యప్రభ, జగ్గంపేట ఏడీఏ వైవీ గంగాధర్ పరిశీలించారు.

భారీ వర్షాలకు కూలిన ఇళ్లు

గొల్లప్రోలు, సెప్టెంబరు 3: గొల్లప్రోలులో భారీ వర్షాలకు తాటాకిల్లు కూలింది. పట్టణంలోని 5 వార్డులో తండూరి సత్యవతికి చెందిన గృహం నేలకూలింది. ఇంట్లో ఉన్న టీవీ, ఇతర గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందులోనే ఉండిపోయాయి. తలదాచుకునేందుకు కూడా స్థలం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

గండేపల్లి: భారీ వర్షాలకు మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నీలికుండీలపేటకు చెందిన వల్లభశెట్టి నాగేశ్వరరావు పెంకుటిళ్లు సగం మేరకు కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకుని ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించాలని నాగేశ్వరరావు కోరుతున్నాడు.

గృహ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా కృషి : పీడీ

సామర్లకోట, సెప్టెంబరు 3: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం సెప్టెంబరు 24 నాటికి 100 రోజుల పాలన పూర్తి పురస్కరించుకుని 100రోజుల ప్రణాళికలో గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా వివిధ శాఖధికారులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని జిల్లా గృహనిర్మాణ ప్రాజెక్ట్ డైరక్టర్ ఎన్వీవీ.సత్యనారాయణ పేర్కొన్నారు. సామర్లకోట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో డి.శ్రీలలిత ఆధ్వర్యంలో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణ రుణం మంజూరై ఎటువంటి బిల్లులు పొందని వారి సమాచారం సేకరించి ఆన్‌లైన్‌లో నమోదులు చేయాలని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్, డీఈ సురేష్, ఏఈ మహ్మద్ ముస్తాక్, ఎంపీపీ సత్తిబాబు తదితర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటికి తాళం వేసినప్పుడు కనిపించకూడదు : సీఐ

కాకినాడ రూరల్, సెప్టెంబరు 3: ఎవరైనా ఇల్లు వదిలి బయటకు వెళ్లేటపుడు తలుపు, గేటుకు గానీ తాళం కప్ప బయటకు కనిపించే విధంగా వేయకూడదని ఆవిధంగా వేస్తే ఎవరూ ఇంట్లో లేనట్లు దొంగలకు చాలా సులువుగా తెలుస్తుందని కాబట్టి ఆ విధంగా వేయరాదని కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ సూచించారు. రూరల్ సీఐ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో సీఐ మాట్లాడుతూ మహిళలు బయటకు వెళ్లేటపుడు వారి మెడలోని బంగారు ఆభరణాలు బయటకు కనిపించే విధంగా కాకుండా చెంగుకప్పుకుని వెళ్లాలన్నారు. ఇంటి చుట్టు పక్కల ప్రాంతాల్లో రాత్రి, పగటి వేళల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే 100, 112కి డయల్ చేయాలని తెలిపారు. ఎస్ఐలు మణికుమార్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానాజీకి రైతుల కృతజ్ఞతలు

కరప, సెప్టెంబరు 3: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముందుచూపుతో తమ పంటపొలాలకు ముంపు ముప్పు తప్పిందని పలువురు రైతులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. అరట్లకట్ట గ్రామంలో మంగళవారం జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి ఆధ్వర్యంలో రైతులు సమావేశమై ఎమ్మెల్యే నానాజీకి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని సాగు దుస్థితిపై ముందుగానే అధ్యయనం చేసిన ఎమ్మెల్యే నానాజీ భారీవర్షాలకు పంటపొలాలు దెబ్బతినకుండా సొంత నిధులను వెచ్చించి గత వేసవిలో ప్రొక్లెయినర్లతో మురుగు, పంటకాలువల్లో పూడికలు, గుర్రపుడెక్క, తూటుకాడను తొలగింపజేశారు. కూటమి నాయకులు వెలుగుబంటి శ్రీనివాస్, భక్తుల సతీష్, వీరంరెడ్డి ముత్యాలరావు, ఎడ్ల శ్రీను, పుల్లయ్యప్రసాద్, బిరుదా భాస్కర్, గంటా నానిబాబు, బండారు ప్రసాద్, నక్కా మల్లేశ్వరరావు, మార్కండేయులు,పండు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 3: తాగి వాహనాలు నడిపిన 13మందికి కాకినాడ మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వినరసింహారావు జైలు, జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల ప్రకారం.. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉదేశ్యంతో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు సీఐ రమేష్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం మత్తులో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 13మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జరిమానా చెల్లించలేని ముగ్గురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో పదిమందికి ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పన జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పిఠాపురం రూరల్, గొల్లప్రోలు ఎస్ఐలు గుణశేఖర్, రామకృష్ణల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ డ్రైవ్ చేస్తూ పిఠాపురం రూరల్ పరిధిలో ఎనిమిది మంది, గొల్లప్రోలు పరిధిలో 13మంది పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వీవీ అపర్ణ మంగళవారం తీర్పు చెప్పారు.

'గ్రామాల్లో విషజ్వరాలు వ్యాపించకుండా చర్యలు'

గండేపల్లి, సెప్టెంబరు 3: ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు వ్యాపిస్తున్నాయని వాటి బారినపడకుండా గ్రామాల్లో అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రమేష్ సూచించారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటా సర్వే చేసి పరిసరాలు పరిశుభ్రం గా ఉంచేలా అవగాహన కల్పించాలన్నారు. పరీక్షల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి సొమ్ములు సొమ్ములు ఖర్చు చేసుకోవద్దని, గండేపల్లిలో డెంగ్యూ, మలేరియా పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు.

'సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి'

ఏలేశ్వరం, సెప్టెంబరు 3: సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని స్పార్క్ చైర్మన్ సాయి సందీప్ అన్నారు. మంగళవారం యర్రవరం విజ్ఞాన జ్యోతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న దాడులు, మోసాలు, హ్యాకింగ్, ఆన్‌లైన్ లింకులు తదితర అంశాలపై సందీప్ వివరించి అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. రవి కిరణ్, ఆదిత్య, సుధీర్, సాహల్, కళాశాల ప్రిన్సిపాల్ రమణ పాల్గొన్నారు.

'రక్తహీనతను అధిగమించాలి'

తాళ్లరేవు, సెప్టెంబరు 3: ప్రతీ మహిళ ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని తీసుకుని రక్తహీనతను అధిగమించాలి సూపర్‌వైజర్ భావని అన్నారు. మంగళవారం పోలేకుర్రులో అంగన్వాడీకేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. రక్తహీనత నివారణ, పౌష్టికాహారంపై తల్లులకు వివరించారు. కార్యక్రమంలో పోలేకుర్రు, పి.మల్లవరం అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ఏలేశ్వరం, సెప్టెంబరు 3: నేటి సమాజంలో విద్యార్థులు కంప్యూటర్ విద్యను పెంపొందించుకోవాలని విప్రో టీంలీడర్ వసంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు ప్రస్తుత టెక్నాలజీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వసంతకుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవాలన్నారు. ప్రయాగ మూర్తి, వెంకటేశ్వరరావు, బంగార్రాజు, వీరభద్రరావు, మదీనా పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం

కిర్లంపూడి, సెప్టెంబర్ 3: బూరుగుపూడి గ్రామంలో జనసేన యూత్ నాయకులు పాటంశెట్టి మణికంఠ, బాబ్జి, త్రిమూర్తులు, రమేష్, తుంపాల సాయి, మిరియాల శ్రీను, సదాశివుని శివ, పసి నాయుడు, యర్రంశెట్టి తాతాజీ, కొలుమూరి రాంబాబు, బాలిన బ్రదర్స్ ఆధ్వర్యంలో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ చేతుల మీదుగా రెండు నిరుపేద కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు.

ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం

గండేపల్లి, సెప్టెంబరు 3: ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీవో వెంకటరామన్ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది గ్రామాల్లో మెరుగ్గా పనిచేయాలన్నారు. పనులు గుర్తించడంతో పాటు ఉపాధి హామీలోని హార్టికల్చర్, వనం మనం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో గంగాభవానీ, ఈసీ రమేష్, టీఏలు శ్రీను, మోహన్, సిబ్బంది ఉన్నారు.

ముంపునీరు పోయేదెలా..!



కరప, సెప్టెంబరు 3: కరపలో మహత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల చుట్టూ వర్షంనీరు స్తంభించిపోయింది. దోమలు వృద్ధిచెంది వసతి గృహంలోని విద్యార్థులపైకి దండెత్తుతున్నాయి. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో పరిస్థితి అదుపు తప్పకముందే ఈ ముంపునీటిని బయటకు మళ్లించే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

విజయవాడ వరద బాధితులకు అండగా..

ఆహార పదార్థాల తరలింపు

జగ్గంపేట, సెప్టెంబరు 3: విజయవాడలో వరద బీభత్సంతో అల్లాడుతున్న ప్రజలకు అండగా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ 40వేల బిర్యానీ ప్యాకెట్స్, లక్ష వాటర్ ప్యాకెట్స్ పంపిణీ చేసేందుకు మంగళవారం జగ్గంపేట టీడీపీ కార్యాలయం నుంచి వాహనంలో నాయకులు, కార్యకర్తలు తీసుకునివెళ్లారు. ఈ వాహనాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ జెండా ఊపి ప్రారంభించి వాహనంతో పాటు విజయవాడ బయల్దేరి వెళ్లారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుని రూరల్: విజయవాడ ప్రజానీకానికి మేము సైతం లోవ తలపులమ్మ లోవ దేవస్థానం నుంచి పులిహోర ప్యాకెట్లు, తుని మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిత్యావసర సరుకులు తరలించారు.



జగ్గంపేటలో వాహనాన్ని ప్రారంభిస్తున్న జ్యోతుల నవీన్

కిర్లంపూడి: కిర్లంపూడి టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆహార పొట్లాలు అందించేందుకు విజయవాడ వెళారు.తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ, ఎడ్ల మురళీకృష్ణ, ఆళ్ల నానాజీ, శ్రీమన్నారాయణ, శివ ఉన్నారు.



కాకినాడ సిటీ: విజయవాడలో వరద సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

పునరావాస కార్యక్రమాలు పర్యవేక్షించిన కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 3: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విజయవాడ వెళ్లిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మంగళవారం పునరావాస కార్యక్రమాలు పర్యవేక్షించారు. విజయవాడలో వరద ముంపునకు గురైన ముస్తఫారోడ్డు, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో స్థానికులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు, తాగునీరు, మందులు, ఆహార సరఫరాను పర్యవేక్షించారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విజయవాడకు వెళ్లిన పారిశుధ్య సిబ్బంది

పిఠాపురం, సెప్టెంబరు 3: విజయవాడలో భారీ వరదల కారణంగా ఉత్పన్నమైన పరిస్థితుల నేపధ్యంలో ఇతర జిల్లాల నుంచి పారిశుధ్య సిబ్బందిని పంపాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరు నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పిఠాపురం మున్సిపాలిటీకి చెందిన 20మంది పారిశుధ్య కార్మికులు, ఒక శానిటరీ ఇనస్పెక్టర్, ఇద్దరు శానిటరీ మేస్త్రీలు, ఇద్దరు వార్డు శానిటేషన్ సెక్రటరీలను విజయవాడలో విధుల నిర్వహణకు నియమించారు. వారిని మంగళవారం విజయవాడ పంపినట్టు పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావు తెలిపారు.



విజయవాడ వెళ్తున్న పిఠాపురం పారిశుధ్య సిబ్బంది

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి : దాట్ల

తాళ్లరేవు, సెప్టెంబరు 3: ప్రతీ ఒక్కరు మొక్కలను నాటే బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ పుట్టిరోజును పురస్కరించుకుని మంగళవారం చొల్లంగి జిల్లాప్రజాపరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు జనసైనికులు ఏర్పాటు చేసిన భోజనాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. హైస్కూల్ ప్రాంగణంలో జనసైనికులు ఏర్పాటుచేసిన మొక్కలను నాటారు. కార్యక్రమంలో జనసైనికులు యేసూరి వరప్రసాద్, మందాల సురేష్, యేసూరి బయ్యన్న, స్వర్ణలోవరాజు, కొత్తగళ్ల గోవిందు, టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, నడింపల్లి వినోద్, జనసైనికులు సూరంపూడి కుమార్, ముత్యాల జయలక్ష్మి, అత్తిలి బాబూరావు తదితరులున్నారు.

మొక్కలు నాటిన వైద్యులు

జగ్గంపేట, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్ పుట్టిన రోజు పురస్కరించుకుని జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో వైద్యులు మొక్కలు నాటారు. డాక్టర్ అడబాల సుగంధి, డాక్టర్ మాధురి, డాక్టర్ తేజ, డాక్టర్ శ్రావణ సంధ్య ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

పూడిక తీత పనుల పరిశీలన

సామర్లకోట, సెప్టెంబరు 3: పట్టణ పరిధిలో పలు ప్రధాన డ్రైన్లలో సుదీర్ఘకాలంగా పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం పరిశీలించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి రైల్వే గేట్ వరకూ గల ప్రధాన డ్రైన్‌లో పూడికత తొలగింపు పనులను పరిశీలించి డ్రైన్‌లో ఎటువంటి అవరోధాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో పలు ప్రధాన డ్రైన్లలో పూడిక తొలగింపు పనులకు రూ.36 లక్షల నిధుల వెచ్చిస్తున్నందున పనులు పూర్తయితే ముంపు సమస్య సామర్లకోటకు ఇక ఉండబోదన్నారు. పనులు పూర్తి పారదర్శకంగా జరిగేలా కూటమి నాయకులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'మట్టి గణపతిని పూజించాలి'

కాకినాడ రూరల్, సెప్టెంబరు 3: నీటికాలుష్య పరిరక్షణకు మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సూచించారు. ఇంద్రపాలెంలో మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ చేపట్టిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మేడిశెట్టి రామ్మోహన్, జనసేన నాయకులు గవర శ్రీరాములు, అప్పారావు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పిచ్చితుగ్లక్ నిర్ణయంతోనే వరద కష్టాలు

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



గొల్లప్రోలులో ముంపులో ఉన్న పంటపొలాలు పరిశీలిస్తున్న వర్మ

గొల్లప్రోలు, సెప్టెంబరు 3: జగన్‌రెడ్డి పిచ్చితుగ్లక్ నిర్ణయంతోనే గొల్లప్రోలుతో పాటు పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు వరద కష్టాలు వచ్చి పడ్డాయని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుద్దగడ్డ వరదల కారణంగా గొల్లప్రోలు వద్ద ముంపునకు గురైన పంటపొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. పొలాల్లోకి దిగి కుళ్లిపోతున్న వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణకు తాను ఎమ్మెల్యేగా ఉండగా రూ.156కోట్లు మంజూరు చేయించి సీఎం చంద్రబాబుతో శంకుస్థాపన చేయించానని గుర్తు చేశారు. పనులు ప్రారంభించగా ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ ఆ పనులను రద్దు చేశారని తెలిపారు. అదేవిధంగా 60శాతం పూర్తయిన ఏలేరు ఫేజ్-1 పనులను నిలిపివేశారని చెప్పారు. దీనితో వరదలు వచ్చిన ప్రతిసారి వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని, త్వరలోనే కూటమి ప్రభుత్వం ఈ పనులు ప్రారంభిస్తుందని తెలిపారు. ఆయన వెంట టీడీపీ పట్టణ, మండలశాఖ అధ్యక్షులు గుండ్ర సుబ్బారావు, ఉలవకాయల దేవేంద్రుడు, బస్వా సత్యనారాయణ, దువ్వా తాతాజీ, ఓరుగంటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం పూజలకు పిలవలేదు

పిఠాపురం పాదగయ క్షేత్రంలో శ్రావణమాసం శుక్రవారం జరిగిన వరలక్ష్మి వ్రత పూజలకు రమ్మని తనను ఎవ్వరు పిలవలేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఒక టిక్కెట్ ఇవ్వలేదని తెలిపారు. తన 22ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో తొలిసారి శ్రావణ శుక్రవారం పూజల్లో తాను, తన సతీమణి పాల్గొనలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రావణమాసం ఆఖరిరోజు సందర్భంగా పిఠాపురం పాదగయ క్షేత్ర ంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం ప్రత్యేక పూజలు చేసి మీడియాతో మాట్లాడారు.



పెద్దాపురం: పులిమేరులో ధర్నా చేస్తున్న ఆశాలు

ఆశా వర్కర్ల ధర్నాలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 3: మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయు ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడలోని పీహెచ్‌సీల వద్ద ఆశావర్కర్లు ధర్నాలు నిర్వహించారు. ప్రతాప్‌నగర్, నేతాజీ పార్కు పీహెచ్‌సీల వద్ద జరిగిన ధర్నాల్లో సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించేందుకు దేశవ్యాప్తంగా సమగ్ర చట్టాన్ని చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నగర అధ్యక్షురాలు కె.పద్మావతి, పి.జ్యోతి, బి.రాణి, ఎల్.లీలావతి, వైఁ.రమాదేవి ఎం.అమ్ములు పాల్గొన్నారు.

పెద్దాపురం: ఆశావర్కర్ల రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు మండ పరిధిలోని పులిమేరు, కాండ్రకోట గ్రామాల్లో పీహెచ్‌సీల వద్ద ఆశాలు ధర్నా చేసి వైద్యాధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఆశావర్కర్ల యూనియన్, సీఐటీయూ నాయకులు ఈశ్వరి, దాడి బేబీ, నాగరత్నం, సీత, వరలక్ష్మీ, నాగమణి పాల్గొన్నారు.

గొల్లప్రోలు: ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

'సమాజం పట్ల బాధ్యతతో మెలగాలి'



కరపలో అవగాహన ర్యాలీ

కరప, సెప్టెంబరు 3: ప్రతీఒక్కరూ విద్యార్థి దశ నుంచి సేవాగుణం పెంపొందించుకుని, సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని కాకినాడ గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. మునిరత్నమ్మ సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులతో 4రోజుల బాటు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్(నేషనల్ సర్వీస్ స్కీమ్) స్పెషల్ క్యాంప్‌ను ఆమె ప్రారంభించారు. క్యాన్స ర్‌పై మండలపరిషత్ కార్యాలయం నుంచి బజారుసెంటర్ వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి వి.ఏంజెలిన్, ఎన్ఎస్ఎస్ ఆఫీర్ మాధవి, ఏఎస్ఐ వి.సూరిబాబు, గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఏవో భాస్కర్ రావు, టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే

రౌతులపూడి, సెప్టెంబర్ 3: రౌతులపూడి ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మంగళవారం పరిశీలించారు. ప్రతి వార్డులో రోగుల వైద్యసేవలను తెలుసుకున్నారు. జ్వరాల పరిస్థితి పై వైద్యులను అడిగారు. ఎంపీపీ గంటి మళ్ల రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, టీడీపీ యువనేత ఇటంశెట్టి అశోక్, ఆసుపత్రి డైరెక్టర్ బండారు సత్యనారాయణ తదితరులున్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్ట్

రౌతులపూడి, సెప్టెంబరు 3: రాజవరంలో పేకాడుతున్న 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.8.900 నగదు పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.